హడలెత్తిస్తున్న రోడ్లు

- ప్రయాణం ప్రమాదకరం
- రోడ్లన్నీ ఛిద్రమే
- ఏలూరు నగరంలో ప్రజలకు అవస్థలు

ఏలూరు (టూటౌన్): చినుకు పడితే చాలు ఏలూరు నగరంలోని రోడ్లన్నీ ఛిద్రంగా మారుతున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం సాగించాలంటే ప్రజలు హడలి పోతున్నారు. నగరంలో దాదాపు 600 రోడ్లకు రూ.1.25 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేయగా కొద్ది నెలలు తిరక్కుండానే తిరిగి గోతులు ప్రత్యక్షమయ్యాయి. రోడ్లన్నీ అద్దంగా చేసేశామంటూ నేతలు గొప్పగా ప్రకటనలు గుప్పించినా క్షేత్రస్థాయిలో ఒనగూరిన ప్రయోజనం ఏమీ కనబడలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షానికే నగరంలోని రోడ్లన్నీ పాడైపోయాయి. దీంతో నగర ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

జలమయం

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగు నీరు పొంగిపొర్లి రోడ్లపైకి చేరింది. బురద, వ్యర్థాలతో రోడ్లు దర్శనమిస్తున్నాయి. స్థానిక వంగాయగూడెం క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డు, బీడీ కాలనీకి వెళ్లే రోడ్డు, ఏలూరు 12 పంపుల సెంటర్, పవరుపేట సెంటర్, రైల్వే ట్రాక్ రోడ్డు, పవరుపేట రైల్వే గేటు సెంటర్, శ్రీనివాస థియేటర్ రోడ్డు, ఎన్ఆర్‌పేట ఇలా ప్రతి రోడ్డుపైకీ నీటితోపాటు వ్యర్థాలూ చేరాయి. రోడ్ల గోతుల్లో వర్షం నీరు నిలిచి వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



పాత బస్టాండ్ నుంచి తూర్పులాకులకు వెళ్లే ప్రధాన మార్గంలో రైల్వే స్టేషన్ వద్ద రోడ్డు గోతులు



తంగెళ్లమూడి సబ్‌స్టేషన్ నుంచి బీడీ కాలనీకి వచ్చే ప్రధాన రహదారి దుస్థితి ఇలా..



వంగాయగూడెం నుంచి కొత్తూరు వెళ్లే మార్గంలో క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రోడ్డు పరిస్థితి

మొక్కుబడిగా మరమ్మతులు



కొద్ది నెలల కిందట నగరంలోని పలు రోడ్లకు మరమ్మతులు చేశామంటూ నేతలు, అధికారులు ప్రకటనలు గుప్పించారు. రోజుకో ఫొటోకు ఫోజులిచ్చి ప్రజలకు ఎంతో మేలు చేసినట్టు ప్రకటించారు. తీరా రెండు రోజుల నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షానికే రోడ్లపై గోతులు యథావిధిగా ప్రత్యక్షమయ్యాయి. నేతలు చెప్పేదానికి, చేసే దానికి పొంతన లేకుండా ఉంది.

– బండి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఐటీయూసీ, ఏలూరు

రోడ్లన్నీ ఛిద్రమే



గత రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షం దెబ్బకు నగరంలోని రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. మూడునెలల కిందట రోడ్లన్నీ బాగు చేసేశామంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పగా చెప్పుకున్నా పనుల్లో నాణ్యత లేమీ కొట్టొచ్చినట్టు కనిపించింది. తక్షణం పాడైపోయిన రోడ్లను బాగు చేయాలి. రోడ్లపై నగర ప్రజల అవస్థలను తీర్చాలి.

– బి.సోమయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు, ఏలూరు

క్లుప్తంగా

రాష్ట్రీయ పోషణ మాసోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శారద

ఏలూరు (టూటౌన్): ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి పునాది అవుతుందని ఐసీడీఎస్ పీడీ పి.శారద అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈనెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ హాజరై మాట్లాడారు. పౌష్టికాహార ప్రదర్శన, పౌష్టికాహారం గురించి ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా సోమయ్య

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీఎంఈఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుద్ద సోమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 16న అనంతపురంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ప్రకటించారని సోమయ్య పేర్కొన్నారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రక్తదానం శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న గారపాటి చౌదరి

ఏలూరు (టూటౌన్): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ రాబోయే రోజుల్లో ప్రపంచానికి దిక్సూచిగా మారబోతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఏలూరులోని జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు నగరపాటి సత్యనారాయణ, గాది రాంబాబు, నెరుసు నెలరాజా, మాలతి రాణి, కట్నేని కృష్ణ ప్రసాద్, చలమల సత్యనారాయణ, అదపాక నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ మందులపై అవగాహన కలిగించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బ్యూలా ఫ్లోరెన్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హెచ్ఐవీకి ఏఆర్‌టీ మందులను పూర్తి స్థాయిలో వాడేలా ఔట్‌రీచ్ వర్కర్లు, సీఎస్‌సీలు అవగాహన కలిగించాలని ఏఆర్‌టీ వైద్య అధికారి డాక్టర్ బ్యూలా ఫ్లోరెన్స్ సూచించారు. స్థానిక వంగాయగూడెంలో బుధవారం ఔట్‌రీచ్ వర్కర్లు, సీఎస్‌సీ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏఆర్‌టీ మందులు వాడుతూ మానివేసిన వారిని ఎల్ఎఫ్‌యూ కేసులుగా భావించి వారిని తిరిగి మందులు వాడే విధంగా కృషి చేయాలన్నారు. ఏఆర్‌టీ మందులు వాడుతున్న వారి ఆరోగ్య, జీవన పరిస్థితులను పెంపొందించుకోవడానికి నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఎల్ఎఫ్‌యూ కేసులు పూర్తిగా తగ్గించేందుకు ఏలూరు, జంగారెడ్డిగూడెం ఏఆర్‌టీ సెంటర్లలో సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్‌జీ. ఆదిలింగం, షేర్ ఇండియా పీఓ జీఎస్ జగదీష్‌యాపిల్ సీఎస్‌సీ ప్రాజెక్టు డూరక్టర్ టీ. శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్వీయరక్షణపై అవగాహన



మహిళా కాలేజీ వద్ద స్వీయరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగమణి, శక్తి టీమ్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో విద్యార్థినుల భద్రతపై ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జూనియర్ కాలేజీలు, డిగ్రీ కళాశాలల వద్ద విద్యార్థినులకు స్వీయ రక్షణకు చేపట్టాల్సిన చర్యలు, మహిళా భద్రతకు, రక్షణ చట్టాలపైనా అవగాహన కల్పించారు. డ్రోన్ కెమెరాలతో కాలేజీల వద్ద ఈవ్ టీజింగ్ వంటివి లేకుండా ప్రత్యేక నిఘా పెట్టారు. శక్తి టీమ్ బృందాలు విద్యార్థినులను జాగ్రత్తగా కాలేజీల నుంచి హాస్టల్స్ వరకు తీసుకెళ్లారు. శక్తి టీమ్స్ ఏలూరు నగరంలోని పార్కులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ తిరుగుతూ మహిళలకు, యువతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదంలో ఉంటే, వెంటనే డయల్ 112, 181 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని లేదా శక్తి టోల్ ఫ్రీ నంబర్ 799348 5111కు సమాచారం ఇవ్వాలని ఏలూరు మహిళా స్టేషన్ ఎస్సై నాగమణి సూచించారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

20న ఏలూరులో సాహిత్య సమ్మేళనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న సాహిత్య సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు హిందూ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మన తెలుగు సహస్రావధానులు, అష్టావధానులు కలిసి త్రిశతావధాని వద్దిపర్తి పద్మాకర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాల్లో ఉదయం 10.45 గంటలకు అష్టావధానం, అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు ప్రసిద్ధ కవులతో భువన విజయం కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలపై సమీక్ష రచన పోటీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని, ఈ పోటీలో పాల్గొనే వారు తమ సమీక్ష తెలుగులో రాయాలని కోరారు. ఉత్తమ సమీక్షకు మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతిగా రూ.2 వేలు, మూడో బహుమతిగా రూ.1,000, రెండు ప్రత్యేక బహుమతులు రూ.1,000 చొప్పున అందజేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 94930 59598, 90323 23632లో సంప్రదించవచ్చన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కుట్ర



యువజన, విద్యార్థి విభాగాల నేతలతో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయరాజు

ఏలూరు టౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, చేయలేదనీ అసత్య ప్రచారం చేయటంతోపాటు మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వ చేస్తోన్న కుట్రలకు నిరసనగా ఈనెల 19న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు తెలిపారు. ఏలూరులో బుధవారం ఆయన చింతలపూడి నియోజకవర్గం యువజన, విద్యార్థి విభాగం నేతలు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈనెల 19న ఉదయం 10 గంటలకు చేపటట్టే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే, కూటమి నేతలు, సీఎం చంద్రబాబు ఏమీ కట్టలేదంటూ అసత్య ప్రచారం చేయటం దారుణమని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు సీఎం చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వ కుట్రపూరిత రాజకీయాలను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కదలిరావాలని కోరారు. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏదైనా ఒక్క గొప్ప కార్యక్రమాన్ని చేశారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో ఏలూరు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొమ్మిన నరేష్, పార్టీ కామవరపుకోట మండల అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ, తడికలపూడి సొసైటీ మాజీ అధ్యక్షులు గుర్రాల రవికుమార్, జంగారెడ్డిగూడెం మండల యువజన అధ్యక్షుడు గంజి వినోద్, కుచలపాటి మహేష్, వానచర్ల లింగాస్వామి, పడాల శ్రీను, గుడే పెద్దిరాజు, మాండ్రు దాసు, జెట్టి రాజేష్, కె.అంజి, కంచె రాజశేఖర్, నాగేంద్ర, తోట రమేష్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ఎమ్మెల్యే చంటికి వినతి పత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైములను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం 50 వేలకు పైగా భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన క్లైములు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని, మరిన్ని అదనపు సౌకర్యాలు కల్పిస్తామని హామీని ఇచ్చారని గుర్తు చేశారు. వెంటనే ఎన్నికల హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, క్లెయిములను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.కిషోర్, నాయకులు బి.జగన్నాథరావు, సంజీవిని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖర్ (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీ ప్రకటించాలి

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగులు కార్మికులకు 12వ పీఆర్‌సీ ప్రకటించాలని, ఐఆర్ ఇవ్వాలని, మున్సిపల్ ఆప్కాస్ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంత్రి పి.నారాయణకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఏలూరు పర్యటనకు వచ్చిన మంత్రిని మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు పెండింగ్ సరెండర్ లీవ్ లు, డీఏలు ఇవ్వాలని, మున్సిపల్ ఆప్కాస్ ఉద్యోగులకు సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, యూనిఫారం, చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనెలు ఇవ్వాలని కోరారు. యూనియన్ నాయకులు బి.సోమయ్య, లావేటి కృష్ణారావు, అంగుళూరు జాన్ బాబు, పంతం చిన్న నాగరాజు, రాము, మీనా కుమారు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు స్వాగతం

ఏలూరు (టూటౌన్): ఏలూరులో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్‌లు పూల మొక్కలు, పూల బుకేలు అందించి మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోణంగి డంపింగ్ యార్డును, టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	44	బీళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	28	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	38
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	37
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌ను కలిసిన జెడ్పీటీసీ సరస్వతి దంపతులు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లి ఆయన నివాసంలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో ఏలూరు జెడ్పీటీసీ మండల సరస్వతి, వడ్డీలు కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మండల కొండలరావు మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్పీటీసీ దంపతులు జగన్‌కు జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా రామస్వామి నాయకర్ జయంతి



పెరియార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): సామాజిక న్యాయ పోరాట యోధుడు, సనాతన ధర్మం నిర్మూలన యోధుడు పెరియార్ రామస్వామి నాయకర్ 146వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నరసింహారావుపేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెరియార్, వెంపా నాగరాజు , బొల్లారపు నాగరాజు,స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

జంగారెడ్డిగూడెం: ఏళ్లు గడుస్తున్నా నేటికి పట్టెన్నపాలెం హైలెవల్ బ్రిడ్జి పూర్తి కాలేదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాగు ఉధృతంగా వస్తే ప్రాణనష్టం ఎక్కువగా ఉంటోందని, గతంలో వ్యవసాయ కార్మికులు, రైతులు సుమారు 20 మంది వరకు గల్లంతయ్యారన్నారు. ఈ బ్రిడ్జి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

24న నిర్బంధ వాహనాలకు వేలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రవాణా శాఖ ద్వారా నిర్బంధించిన రవాణా, రవాణేతర వాహనాలకు ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక మోటార్ కారు, 7 గూడ్స్ క్యారియర్లు, 1 మ్యాక్సీ క్యాబ్, 1 కాంట్రాక్టు క్యారేజ్ బస్సు, 3 ఆటో రిక్షాలు, 1 ట్రాక్టర్, ట్రైలర్, 6 మోటార్ సైకిల్స్‌ను రోడ్డువర్తి, స్క్రాబ్ క్రింద నూజివీడు ఆర్టీసీ డిపో, ఎంవీఐ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనరు కార్యాలయం ఆర్టీసీ డిపో ఏలూరులో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ధరావత్తు సొమ్ముగా (డిపాజిట్) రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ఏలూరు(మెట్రో): జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం విశ్వకర్మ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. పద్మశ్రీ మాట్లాడుతూ విశ్వకర్మ భగవాన్ శిల్పులు ఆరాధ్య దేవతగా, సృజనాత్మకతకు ప్రతీకగా పూజింపబడతారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో కార్మికులు, శిల్పులు, వృత్తి దారులు పాత్ర వెలకట్టలేనిన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవాన్‌కు పూజలు చేశారు. జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ ఎం శ్రీహరి, కార్పొరేటరు సాంబశివ రావు, లక్కోజు గోపాలాచారి, జిల్లా పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు దసరా బోనస్ అందించాలి

కుక్కునూరు: సివిల్ సప్‌లై హమాలీలతో పాటు జీసీసీ హమాలీలకు దసరా బోనస్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం అల్లూరి సీతారామరాజు హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో హమాలీలు కడారి తిరుపతయ్య, తిరోజుల సురేష్, నెర్రబోయిన సాయిరాం, మచ్చా చందు, మచ్చా లక్ష్మణ్, రామ్‌చరణ్, బంధం విక్రమ్, సోడే వెంకటేష్, కుర్సం ముత్తేష్, సోడే లక్ష్మణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల అందజేత

జంగారెడ్డిగూడెం: డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేశారు. సంఘ వ్యవస్థాపకులు అమ్ముతల రంగ, గౌరవ అధ్యక్షుడు నేలప్రోలు ప్రభాకర్‌రావు, దాత వట్టూరి శ్రీనివాస రావు, పఠాన్ బాజీ, లింగం కుంట శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్‌టీలను క్రమబద్ధీకరించాలి

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్‌టీ)లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని కోరుతూ బుధవారం సీఆర్‌టీయూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు కంగాల గోపాలకృష్ణ మాట్లాడుతూ సీఆర్‌టీలుగా తాము సుమారు 13 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని చెప్పారు.